


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక | ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 359 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 29 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :359 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 29 AUGUST 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

- రాఖీ పండుగ సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల పెంపు
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ ఛార్జీపై 50 శాతం అదనం
- రాష్ట్రవ్యాప్తంగా 5,000 ప్రత్యేక బస్సు సర్వీసులు
- 1981 నాటి జీవో ప్రకారమే పెంపు అని అధికారుల వెల్లడి
- సాధారణ సర్వీసుల్లో ఛార్జీలు యథాతథం

- మిగతా 2లో



## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ.. రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

- రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన కొండా సురేఖ - మిగతా 2లో
- రేవంత్ తో పాటు ఆయన అల్లుడు, మనవడికి రాఖీ కట్టిన సురేఖ
- రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు రేవంత్ కు ఉంటాయని వ్యాఖ్య



## కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా.. రెండేళ్లలో ఇది రెండోసారి!

- వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా
- రెండు సంవత్సరాల్లో ఇదే ఆరోపణపై పదవి వీడటం ఇది రెండోసారి
- ప్రెస్ మీట్‌లో తన రాజీనామా ప్రకటిస్తూ కన్నీటిపర్యంతమైన కాంగ్రెస్ నేత
- బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందంటూ నాగేంద్ర ఆరోపణ
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ పాదయాత్రకు సన్నాహాలు

- మిగతా 2లో



## నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

- నేపాల్‌లో ఆకస్మిక వరదలు
- వందల మంది గల్లంతు, కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోషి నదిలో పెరుగుతున్న నీటిమట్టంతో సహాయక చర్యలకు ఆటంకం
- హిమానీనదం కూలడమే ఈ పెను విపత్తుకు కారణమని అనుమానం
- నేపాల్, చైనాతో పాటు పలు దేశాలు సహాయక చర్యల్లో భాగస్వామ్యం



పెన్ పవర్ డెస్క్:నేపాల్-టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది

- మిగతా 2లో

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం

- ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్
- ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం
- అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు
- టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన
- రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ

- మిగతా 2లో

## పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ

- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో లోకేశ్
- ఏపీపీఎస్సీ, డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శ
- సార్వత్రిక ఎన్నికల కన్నా 2 శాతం ఎక్కువ ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తామన్న ధీమా
- జగన్ తప్పుడు పనుల వల్లే వైసీపీ నేతలు జైళ్లకు వెళుతున్నారని ఆరోపణ
- మరో మూడుసార్లు గెలిస్తేనే రాష్ట్రం గాడిన పడుతుందని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

- మిగతా 2లో

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి



- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు
- రాష్ట్రంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్న పవన్
- ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు సమర్థవంతంగా ముందుకు తీసుకెళతారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా జనసేన ఎమ్మెల్సీ నాగబాబు కేబినెట్ హోదాతో బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నాగబాబుకు ఆయన సోదరుడు,

- మిగతా 2లో

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా ప్రముఖ నటుడు, జనసేన ఎమ్మెల్సీ నాగబాబు బాధ్యతలను స్వీకరించారు. మంగళగిరిలోని అరణ్యభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తన భార్య పద్మజతో

- మిగతా 2లో

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్: శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- రూ. 100 కోట్లతో చదలవాడ వద్ద 5 స్టార్ హోటల్
- రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో హోటల్
- హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు ఉపాధి



పెన్ పవర్ డెస్క్:ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రకాశం జిల్లా పర్యటన సందర్భంగా ప్రాంతీయ అభివృద్ధికి సంబంధించి ఒక కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఒంగోలు పరిసర ప్రాంతమైన చదలవాడ వద్ద రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో

- మిగతా 2లో

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- తెలంగాణలో మూడేళ్లలో 7.15 శాతం పెరిగిన మొత్తం నేరాలు
- నార్కోటిక్స్ కేసులు 46 శాతం పెరగడంపై ఆందోళన
- సైబర్ క్రైమ్, ఆర్థిక నేరాల్లో కనిపించిన తగ్గుదల
- తీవ్రమైన నేరాలు తగ్గినా, సాధారణ నేరాలు పెరిగాయన్న గణాంకాలు



పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో గత మూడేళ్లతో పోలిస్తే మొత్తం నేరాల సంఖ్య 7.15 శాతం మేర పెరిగింది. ముఖ్యంగా మాదకద్రవ్యాలు (నార్కోటిక్స్) సంబంధిత కేసులు

- మిగతా 2లో




## : ఒకవైపు అధికార పార్టీ బలం.. మరొకవైపు జగన్ హెచ్చరిక

స్థానిక సంస్థల ఎన్నికలు వైసీపీ నేతల కు ఫీవర్ తెచ్చి పెడుతున్నాయి. బలమైన అభ్యర్థులు, నమ్మకమైన నేతల కోసం ఇప్పటి నుంచే ఆరా తీస్తున్నారు. ప్రధానంగా పదహారు కార్పొరేషన్ లలో మేయర్ పదవి, మున్సిపల్ ఛైర్మన్ ల ఎంపిక వైసీపీ ఇన్ ఛార్జులకు తలనొప్పిగా మారనుంది. అధికార పార్టీని ఎదుర్కొనడం స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో అంత ఈజీ కాదు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అన్ని రకాలుగా బలంగా ఉంటుంది. ఆర్థికంగా, ఇటు అధికారుల నుంచి సహకారం, మరొకవైపు ఓటర్ల మనోగతం కూడా ఈ ఎన్నికల ఫలితాలను ప్రతిబింబిస్తాయి. మూడేళ్లు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తమకు ఎంతో కొంత మేలు, పనులు జరగాలంటే అధికార పార్టీని గెలిపించుకోవడం మంచిదని ప్రజలు సహజంగా విశ్వసిస్తారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ వైపు ప్రజలు మొగ్గు చూపుతారు.

**స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో...**

కూటమి ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తి సాధారణ ఎన్నికల వరకూ బయటపడదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అసంతృప్తి కనపరిస్తే తమ నగరం, పట్టణం అభివృద్ధి జరగదని భావిస్తారు. ఇక అధికార పార్టీ సామ, దాన, భేద, దండోపాయాలను ఖచ్చితంగా తమ విజయం కోసం ప్రయోగిస్తుంది. ఆ వత్తిడిని ఎదుర్కొని తట్టుకుని నిలబడే నేత కావాలంటే అధికారంలోని వైసీపీకి అంత సులువు కాదు. ఆర్థికంగా బలంగా ఉండాలి. తన తో పాటు తన వార్డు మెంబర్లకు కూడా ఆర్థిక సాయాన్ని అందించగల నేత అయి ఉంటేనే ఎంతో కొంత తట్టుకోగలరు. అలాగే పార్టీ పట్ల విధేయత, నాయకత్వం పట్ల నమ్మకం ఉన్న నేత కూడా అవసరం. లేకుంటే అధికార పార్టీ ప్రలోభాలకు లొంగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే అన్ని జాగ్రత్తలు వైసీపీ నేతలు తీసుకోవాల్సి ఉంటుంది.

**ప్రత్యక్ష ఎన్నిక కావడంతో...**

ఎందుకంటే ఈసారి మేయర్, ఛైర్మన్ల ఎన్నిక నేరుగా జరుగుతుంది. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా జరిగే ఎంపిక కావడంతో ఖచ్చితంగా ప్రలోభాలకు చివరి నిమిషం వరకూ గురిచేస్తారు. ఏకగ్రీవం చేసుకోవాలన్నది అధికార పార్టీ పట్టుదలగా ఉంటుంది. మరొకవైపు ఏకగ్రీవమయితే వచ్చే ఎన్నికల్లో సీటు కూడా దక్కదన్న జగన్ హెచ్చరికలు వైసీపీ నేతల చెవుల్లో మారుమోగిపోతున్నాయి. అందుకే ఒకచోట ఇద్దరు నుంచి ముగ్గురు నేతలను ఎంపిక చేసి వారిలో చివరకు ఒకరిని బరిలో ఉంచితే మేలని వైసీపీ నియోజకవర్గ ఇన్ ఛార్జులు భావిస్తున్నారు. కానీ పార్టీ అధికారంలో లేకపోవడంతో ముగ్గురు బలమైన నేతలు దొరకడం అంత సులువు కాదు. తమ జేబులో డబ్బులు పెట్టాలంటే మరింత ఇబ్బంది పడతామని భావిస్తున్నారు. అందుకే వైసీపీ నియోజకవర్గాల ఇన్ ఛార్జుల పరిస్థితి ఒకింత ఆందోళనలో ఉన్నారు. అభ్యర్థుల ఎంపిక పూర్తయి ఎన్నికలు ముగిసే వరకూ వారికి టెన్షన్ తప్పదు.

## తెలంగాణలో పెరిగిన క్రైమ్ రేట్.. ఆందోళనకరంగా ఆర్గనైజ్డ్ క్రైమ్, డ్రగ్స్ కేసులు

- మొదటి పేజి తరువాయి

46.10 శాతం పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశంలో ఈ గణాంకాలను వెల్లడించారు. పోలీసు శాఖ విడుదల చేసిన వివరాల ప్రకారం, 2023–24లో 2,65,377గా నమోదైన మొత్తం కేసుల సంఖ్య, 2025–26 నాటికి 2,84,363కు చేరింది. ఇదే సమయంలో నార్కోటిక్స్ కేసులు 2,026 నుంచి 2,960కు పెరిగాయి. ఇక వ్యవస్థీకృత నేరాలు (ఆర్గనైజ్డ్ క్రైమ్) ఏకంగా 1,704 శాతం పెరుగుదలతో 25 నుంచి 451కి చేరడం గమనార్హం.కాగా, కొన్ని విభాగాల్లో నేరాలు గణనీయంగా తగ్గముఖం పట్టాయి. సైబర్ నేరాలు 13.29 శాతం, ఆర్థిక నేరాలు 13.28 శాతం తగ్గాయి. అలాగే హత్యలు, దోపిడీల వంటి తీవ్రమైన నేరాలు కూడా 10.33 శాతం మేర తగ్గాయి. ముఖ్యంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇటువంటి కేసులు నమోదు 26.23 శాతం తగ్గడం ఊరటనిచ్చే అంశం.మరోవైపు, చిన్నపాటి నేరాలు 7.28 శాతం పెరిగాయి. కొన్ని జిల్లాల్లో ఈ పెరుగుదల అధికంగా ఉంది. నార్కోటిక్స్ కేసుల పెరుగుదల పోలీసు శాఖకు పెద్ద సవాలుగా మారిందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. కేవలం గణాంకాలకే పరిమితం కాకుండా, ప్రతి నేరం వెనుక ఉన్న కారణాలను లోతుగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్) డేటా అప్‌డేట్ రేటు 96 శాతానికి చేరడంపై ఆయన సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరులో వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని, నేరాల కట్టడికి పటిష్ఠమైన ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు.

## ఒంగోలు సమీపంలో రాడిసన్ 5 స్టార్ హోటల్: శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజి తరువాయి

నిర్మించనున్న ప్రముఖ అంతర్జాతీయ బ్రాండ్ 'రాడిసన్' 5 స్టార్ హోటల్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రసిద్ధ రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్ఎల్‌పీ సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రతిష్టాత్మక హోటల్ రూపుదిద్దుకోనుంది.ఒంగోలు ప్రాంతంలో ఏర్పాటు కాబోతున్న మొదటి అంతర్జాతీయ బ్రాండెడ్ 5 స్టార్ హోటల్ ఇదే కావడం విశేషం. 151 విలాసవంతమైన గదులు, మల్టీ–క్యూసిన్ రెస్టారెంట్లు, ప్రీమియం బార్, లాంజ్, స్విమ్మింగ్ పూల్, స్పా, ఫిట్‌నెస్ సెంటర్ వంటి అత్యాధునిక సదుపాయాలతో దీనిని తీర్చిదిద్దుతున్నారు. అంతేకాకుండా, బిజినెస్ టూరిజం విస్తరణకు అనుగుణంగా 2,100 చదరపు మీటర్లకు పైగా విశాలమైన స్థలంలో భారీ బ్యాంకెట్ హాళ్లు, కాన్ఫరెన్స్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. జాతీయ రహదారి–16కి అత్యంత సమీపంలో రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాజెక్ట్ వల్ల పారిశ్రామికవేత్తలు, వ్యాపార ప్రతినిధులు, పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి.ఈ విలాసవంతమైన 5 స్టార్ హోటల్ రాకతో ఒంగోలు, దాని పరిసర ప్రాంతాల్లో హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం లోకేశ్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలతో ఆత్మీయంగా మమేకమయ్యారు. అభిమానులతో ఫొటోలు దిగుతూ, వారి నుంచి వినతులను స్వీకరించారు. రక్షా బంధన్ సందర్భంగా పలువురు మహిళా కార్యకర్తలు లోకేశ్‌కు రాఖీలు కట్టి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్.. పనితీరుకు అదే ప్రామాణికం

- మొదటి పేజి తరువాయి

ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు.ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ౹ా4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే భరోసా కల్పించాలన్నారు. జిల్లాలకు, నియోజకవర్గాలకు వస్తున్న పరిశ్రమలు క్షేత్రస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిం చేలా (గ్రౌండింగ్) ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆదేశించారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారకుండా ఉండేందుకే 'తల్లికి వందనం', 'సంజీవని' వంటి పథకాలు తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ప్రక్రియకు అడ్డంకులు సృష్టించే ప్రయత్నాలు

జరిగినా, పారదర్శకంగా పూర్తి చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేశామని, దీనిపై విమర్శలు వస్తే టీచర్లే స్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రజలను మెప్పించగలిగితే వారి నుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సీఎం ఉద్ఘాటించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కన్నీళ్లతో కర్ణాటక మంత్రి పదవికి నాగేంద్ర రాజీనామా.. రెండేళ్లలో ఇది రెండోసారి!

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర వివాదాస్పదమైన మహర్షి వాల్మీకి గిరిజన అభివృద్ధి కార్పొరేషన్ కుంభకోణం ఆరోపణల నేపథ్యంలో, రాష్ట్ర మంత్రి బి. నాగేంద్ర శుక్రవారం సాయంత్రం తన పదవికి రాజీనామా చేశారు. విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటిస్తూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీటిపర్యంతమయ్యారు. గత రెండేళ్ల కాలంలో ఇదే ఆరోపణలపై ఆయన రాజీనామా చేయడం ఇది రెండోసారి కావడం గమనార్హం.ఈ కుంభకోణం నేపథ్యాన్ని పరిశీలిస్తే, వాల్మీకి కార్పొరేషన్‌లో సుమారు రూ. 89 కోట్ల మేర నిధులు అక్రమంగా బదిలీ అయ్యాయని ఆరోపణలు వచ్చాయి. 2024 మే నెలలో కార్పొరేషన్ అకౌంట్స్ అధికారి చంద్రశేఖరన్ ఆత్మహత్య చేసుకుంటూ రాసిన లేఖతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్పటి సిద్ధరామయ్య ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న నాగేంద్ర, 2024 జూన్‌లో తొలిసారి తన పదవికి రాజీనామా చేశారు. అయితే, డీకే శివకుమార్ ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన తర్వాత, 2026 ఆగస్టు 3న నాగేంద్రను తిరిగి మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కానీ ప్రతిపక్ష బీజేపీ నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురుకావడంతో ఆయన మరోసారి పదవిని వీడాల్సి వచ్చింది. ఈ సందర్భంగా

నాగేంద్ర మాట్లాడుతూ, రాజ్యాంగంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ అంశంపై అసెంబ్లీలో చర్చకు తాము సిద్ధంగా ఉన్నా బీజేపీ ముందుకు రాలేదని విమర్శించారు. బీజేపీకి గిరిజన వ్యతిరేక మనస్తత్వం ఉందని, ఆ పార్టీ 'మనుస్మృతి'ని రుద్దాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు రాయచూర్ నుంచి బళ్లారి వరకు పాదయాత్ర చేస్తామని బీజేపీ ఇప్పటికే ప్రకటించింది. ఈ యాత్రను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రారంభించనున్నారు.

## నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

- మొదటి పేజి తరువాయి

మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి.రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు.ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది. ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు–రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు.

ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## పదోసారి సవాల్ చేస్తున్నా.. డేట్-టైమ్-ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్.. చర్చకు నేను రెడీ

**డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు**

గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్–1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు.

వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

**స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

**మరో మూడుసార్లు గెలవాలి**

రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు.

తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

**జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి**

జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

## రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన కొండా సురేఖ.. రాజకీయాలు మాట్లాడనని వ్యాఖ్య

తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపిన పరిణామాల మధ్య ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ పొలిటికల్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. పరకాల నియోజకవర్గ వివాదంలో కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ నేరుగా సీఎం రేవంత్‌పై చేసిన వ్యాఖ్యలు, ఆపై పీసీసీ క్రమశిక్షణా కమిటీ చర్యలకు సిద్ధమవ్వడం కాంగ్రెస్‌లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి సురేఖపై వేటు పడుతుందనే ప్రచారం జరుగుతున్న తరుణంలో, రాఖీ పండుగను పురస్కరించుకుని ఆమె నేరుగా సీఎం నివాసానికి వెళ్లడం విశేషం.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కొండా సురేఖ ఎంతో ఆత్మీయంగా రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఈ పవిత్రమైన పండుగ రోజున ఎలాంటి రాజకీయాల గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. తాను అందరికీ సోదరినని, రాష్ట్రంలోని ఆడబిడ్డల ఆశీస్సులు, అండదండలు సీఎం రేవంత్ రెడ్డికి ఎల్లవేళలా ఉంటాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని మరిన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లే శక్తిని, ఆయురారోగ్యాలను ఆయనకు ప్రసాదించాలని దేవుడిని కోరుకున్నట్లు సురేఖ తెలిపారు.

## రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు భారంగా మారింది.రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సులో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ. 400 వసూలు చేస్తున్నారు. ఛార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై టీజీఎస్ఆర్టీసీ పీఆర్వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

## పచ్చదనం సంకల్పాన్ని నాగబాబు సమర్థంగా నెరవేర్చాలి

- మొదటి పేజి తరువాయి

రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనంతో కళకళలాడే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలనే ఆశయంతో కూటమి ప్రభుత్వం ఈ ప్రత్యేక నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని, ప్రకృతిపై ఎంతో ప్రేమ ఉన్న నాగబాబు ఈ బృహత్తర బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని ఏకంగా 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ భారీ ప్రాజెక్టును నాగబాబు ముందుకు తీసుకెళతారని పవన్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ఒక ప్రజా ఉద్యమంగా మలిచే బాధ్యతలో ఆయన పూర్తి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

మరోవైపు, నాగబాబుకు కేబినెట్ హోదా కల్పిస్తూ ఏపీ గ్రీన్ కమిటీ ఛైర్మన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకి, అందుకు మద్దతు తెలిపిన కూటమి భాగస్వామ్య పక్షాల నాయకులకు పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన నాగబాబు

- మొదటి పేజి తరువాయి

కలిసి పాల్గొన్న ఆయన... వేదపండితుల మంత్రోచ్చారణలు, ప్రత్యేక పూజల నడుమ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించారు.రాష్ట్ర పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఏపీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న 'ఏపీ గ్రీన్' ప్రాజెక్టును ముందుకు నడిపేందుకు నాగబాబుకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, పచ్చదనం శాతాన్ని ఏకంగా 50 శాతానికి పెంచాలనే భారీ లక్ష్యంతో ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసేందుకు గాను నాగబాబుకు కేబినెట్ హోదా హోదాతో కూడిన బాధ్యతలను అప్పగించింది.బాధ్యతలు స్వీకరించిన అనంతరం నాగబాబును పలువురు ఐఏఎస్ అధికారులు, అటవీ శాఖ సీనియర్ అధికారులు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మర్యాదపూర్వకంగా కలిశారు. పీసీసీఎఫ్ చలపతిరావు, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజలతో పాటు ఇతర ప్రభుత్వ సలహాదారులు, ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.


# 'స్థానిక' పోరు ఏకగ్రీవాలపై జగన్ వ్యాఖ్యలు

# మరో వ్యూహాత్మక తప్పిదమా..?

### వైఎస్సార్సీపీ కేడర్ లోనే భిన్నాభిప్రాయాలు చర్చ

### జగన్ పిలుపు క్షేత్రస్థాయి కార్యాచరణలో సాధ్యమేనా..?

### గ్రామాల్లో లా అండ్ ఆర్డర్ కు విఘాతం కల్పించటమే మీ లక్ష్యమా?




**గిద్దలూరు, పెన్ పవర్ ఆగస్ట్ 28**

ఇటీవల వైఎస్సార్ సీపీ నిర్వహించిన రాష్ట్రంలోని 175 నియోజవర్గాల విస్తృత స్థాయి సమావేశంలో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అటు రాజకీయ వర్గాల్లోనే కాకుండా, ఇటు వైఎస్సార్ సీపీ కేడర్ లో సైతం తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థలో ఏకగ్రీవ ఎన్నిక అనేది వ్యవస్థాగతమైన ఒక విధానం. ప్రభుత్వానికి,ఎన్నికల యంత్రాంగానికి వ్యయ ప్రయాసలు తగ్గే విధంగా దోహదపడతాయని,ప్రజల మధ్య ఐక్యతకు ప్రతీకగా ఉంటాయని,పల్లె సీమల అభివృద్ధిలో ఏకగ్రీవాలు మేలు చేస్తాయని భావించి ఏకగ్రీవాలకు ప్రోత్సాహకాలు కూడా ప్రకటించడం రివాజు. ప్రజాస్వామ్య విలువలకు,నిబంధనలకు తూట్లు పొడిచే ఏకగ్రీవాలను ఖండించాల్సిందే, వ్యతిరేకించాల్సిందే. కానీ భిన్నాభిప్రాయాలున్నచోట భావ సారూప్యత వ్యక్తమైనప్పుడు,పరస్పర ఆమోదంతో శాంతియుతంగా, ప్రజాస్వామ్య విలువలకు లోబడి ఏకగ్రీవాలు జరుగుతాయి. ఇలాంటి నేపథ్యంలో ఎక్కడైనా అసలు ఏకగ్రీవం అంటేనే కుదరదు...మీరేం చేస్తారో నాకు తెలియదు పోటీ పెట్టాల్సిందే.. పోరాడాల్సిందే.. స్థానిక అభ్యర్థులకు అన్ని విధాలా అండగా నిలవాల్సిందే..ఇందుకు భిన్నంగా జరిగితే అలాంటి నియోజకవర్గాల్లో నాయకత్వం వహిస్తున్న పార్టీ ఇంచార్జిలకు సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటివ్వబోనని చెప్పడం ఓ రాజకీయ పార్టీ అధినేతగా జగన్మోహన్ రెడ్డి మరో వ్యూహాత్మక తప్పిదం చేయబోతున్నాడా..? అని పరిశీలకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఒక నియోజకవర్గంలో ప్రజలతో మమేకమైన పార్టీ నాయకులకు ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్థిత్వాలకు సీట్లిచ్చేటప్పుడు మరో నియోజవర్గానికి మార్చడం, మరొకరిని తీసుకురావడం, కొత్త ముఖాలను ప్రవేశపెట్టడం వంటి చర్యలు వికటించి, వైఎస్సార్సీపీ విఫలమై చతికిల పడ్డ సంగతి అందరికీ తెలిసిందే. మళ్లీ క్షేత్రస్థాయిలో జరిగే పల్లె పోరుగా భావించే స్థానిక సంస్థల ఎన్నికల్లో 'ఏకగ్రీవం ఎక్కడా జరక్కూడదు'అన్న వ్యాఖ్య విడ్డూరంగా ఉందని రాజకీయ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. వైఎస్సార్సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలకు జై కొట్టిన వైఎస్సార్సీపీ అధినేత అధికారం కోల్పోయిన నేపథ్యంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆ పార్టీ కేడర్ లోనే విస్మయం వ్యక్తమవుతుందంటున్నారు. బలవంతం, బెదిరింపులు, ప్రలోభాల ద్వారా జరిగే ప్రతీ ఏకగ్రీవాన్ని అడ్డుకోవాలని నాయకులకు, కేడర్ కు పిలుపు ఇవ్వాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ..ఏకగ్రీవమే జరక్కూడదు, జరిగితే మీ సీట్ ఔట్ అనడమేమిటో అర్థం కావడం లేదని ఆ పార్టీ నాయకులు, కేడర్ ఆలోచనలో పడ్డారు. పార్టీ అధినేత దుందుడుకు వైఖరి గతంలో పలుమార్లు పార్టీకి ఇబ్బంది కలిగించిందని అంటున్నారు. శాసన మండలిని రద్దు చేస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదించి, పార్లమెంట్ కు పంపడం, మండలిలో బలం పెరగడంతో మళ్లీ ఆ ప్రతిపాదన ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించడం,పార్టీకి శాశ్వత అధ్యక్షుని ఎన్నిక అంటూ ఎన్నికల సంఘానికి నివేదించడం,ఎన్నికల సంఘం అంగీకరించకపోవడంతో మళ్లీ సరిదిద్దుకోవడం వంటి అంశాలను పరిశీలకులు గుర్తు చేసుకుంటున్నారు. చట్టసభలకు జరిగే ఎన్నికలకు,స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికలకు మధ్య కొంత వ్యత్యాసం లేకపోలేదు. స్థానిక సంస్థల్లో పార్టీలు,వాటి ఆశయాలు,సిద్ధాంతాల కంటే కూడా స్థానిక అభివృద్ధి ప్రధానాంశం అవడమే కాక స్నేహాలు, బాంధవ్యాలు,అనుబంధాలు ప్రధాన భూమికను పోషిస్తాయి.కుల, మత, వర్గ భేదాలను అధిగమించి ఐక్యతారాగానికి ఏకగ్రీవాలు దోహదపడతాయి. ఇలాంటి ఏకగ్రీవాలను ఎన్నికల ప్రక్రియ ఏర్పడినప్పట్నుంచి ప్రశాంత ప్రజాస్వామ్య వాతావరణానికి సూచికలుగా భావిస్తారు. కానీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఏకగ్రీవాల వెనుక ఉన్న ఔన్నత్యాన్ని,ప్రయోజనాలను గుర్తించకుండా ఇలా మాట్లాడమేమిటని,తన పాలనలో ఏకగ్రీవాలు ప్రజాస్వామ్యబద్ధమని, ఇతరుల పాలనలో ఏకగ్రీవం కాకూడదని ఇంచార్జీలకు అల్టిమేటం తరహాలో హెచ్చరిక జారీ చేయడం ఏమిటోనంటూ వైఎస్సార్ సీపీ శ్రేణులు మదనపడుతున్నాయి. ఏకగ్రీవాల్లో పాలక పక్షం ఏకపక్షంగా అధికార దుర్వినియోగానికి పాల్పడితే దీటుగా ఎదుర్కొని ప్రజాస్వామ్య బద్ధంగా పోరాటం చేయాలని కేడర్ కు పిలుపును ఇవ్వాల్సి ఉండగా,అందుకు భిన్నంగా ఏకంగా ఏకగ్రీవాలు కాకూడదనే భావనను ప్రచారస్త్రంగా చేయడమే చర్చనీయాంశమైంది. జగన్మోహన్ రెడ్డి హెచ్చరికను దృష్టిలో పెట్టుకుని ఆ పార్టీ నాయకులు సామరస్యంగా జరిగే ఏకగ్రీవాలను అడ్డుకుంటే స్థానిక ప్రజల్లో ప్రతికూలత ఏర్పడదా ?అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం తర్వాతి అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిబింబిస్తుందన్న భయం కూడా లేక పోలేదు. ఏదేమైనప్పటికీ జగన్మోహన్ రెడ్డి వైఖరి అధికార కూటమికి సవాలుగా నిలిస్తే, వైఎస్సార్ సీపీ నాయకుల స్వేచ్ఛకు,సమయానుకూల వ్యవహారానికి ప్రతిబంధకం అవుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో ఏకగ్రీవాలు అడ్డుకోవడం కూడా రగడగా మారవచ్చు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తాం

### మంత్రి నిమ్మల రామానాయుడు

### కటాఫ్ తర్వాత అర్హులకు రూ.169 కోట్ల ఎక్స్ గ్రేషియా

### సీఎం చంద్రబాబు చారిత్రక నిర్ణయం



**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 28**

వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తామని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరు ఎరిక్షన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ప్రెస్ మీట్ అనంతరం నిర్వాసితులకు ఇచ్చిన ఇంటి స్థలాలను మంత్రి పరిశీలించారు.

**అర్హులందరికీ న్యాయం.. రూ.169 కోట్ల అదనపు పరిహారం..**

వెలుగొండ ప్రాజెక్టులో కూటమి ప్రభుత్వం చారిత్రక నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు. గెజిట్, సోషియో ఎకనామిక్ సర్వేలో నమోదు కాని అర్హులకు కూడా న్యాయం చేయాలని సీఎం ఆదేశించారన్నారు. కటాఫ్ డేట్ తర్వాత అర్హులైన యువతకు కూడా ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని



నిర్ణయించామని, దీని కోసం అదనంగా రూ.169 కోట్లు చెల్లించనున్నట్లు ప్రకటించారు. 2019 కటాఫ్ డేట్ నుండి 2026 వరకు 18 ఏళ్లు నిండిన యువతకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ఇస్తామన్నారు.

**ఇప్పటికే రూ.905 కోట్ల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పంపిణీ..**


ఇప్పటికే 7027 నిర్వాసిత కుటుంబాలకు రూ.905 కోట్ల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని అందించామని మంత్రి వెల్లడించారు. అర్హుల జాబితాలో చేర్చాలని ప్రభుత్వానికి 1800 గ్రీవెన్సులు, పిటిషన్లు వచ్చాయని, వాటిని పూర్తిగా పరిశీలించి ఎక్స్ గ్రేషియా చెల్లిస్తామన్నారు. ఇవాళ్టి నుండే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఆగస్టు 31న వెలుగొండకు నీళ్లు ఇవ్వడంతో పాటు చివరి నిర్వాసితుడికి న్యాయం చేసే వరకు ప్రక్రియ కొనసాగుతుందని హామీ ఇచ్చారు. నిర్వాసితులకు నెల రోజులకు సరిపడా రేషన్ కిట్ కూడా ఇవ్వాలని సీఎం సూచించారన్నారు.

**నిర్వాసితుల త్యాగాలు మరువలేనివి..**

వెలుగొండ ప్రాజెక్టు సాకారం కావడంలో నిర్వాసితుల త్యాగాలు మరువలేనివని మంత్రి కొనియాడారు. నిర్వాసిత కాలనీల్లో మౌలిక సదుపాయాలను పూర్తి చేసి ఎక్కడా అన్యాయం జరిగిందన్న మాట లేకుండా చూస్తామన్నారు. గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే డ్రామాలు ఆడారని విమర్శించారు. సూపర్ ఎల్ నినో పరిస్థితుల్లోనూ సమర్థంగా నీటి నిర్వహణ చేపట్టి డెల్టాలో పంటలకు నీరిస్తున్నామని తెలిపారు.

# డేట్-టైమ్- ప్లేస్ ఫిక్స్ చెయ్ జగన్..

# చర్చకు నేను సిద్ధం





### ఏపీపీఎస్సీకి-డీఎస్సీకి తేడా తెలియని అజ్ఞాని జగన్

### 2024 ఎన్నికల్లో కంటే 2%అదనపు ఓట్లతో స్థానిక ఎన్నికల్లో గెలుస్తాం

### వెలిగొండ ప్రాజెక్టు శంకుస్థాపన చేసింది బాబే, త్వరలో ప్రారంభించేది కూడా చంద్రబాబే

### ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమన్వయ సమావేశంలో టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్





**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 28**

జగన్ కు పదోసారి సారి సవాల్ చేస్తున్నా. టైమ్, డేట్ ఫిక్స్ చెయ్, పులివెందులకి అయినా, తాడేపల్లికి కొంపకు అయినా వస్తా, చర్చకు మీరు సిద్ధమా, డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వారు నాకు నీతులు చెబుతారా అని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమన్వయ సమావేశం శుక్రవారం ఒంగోలులో జరిగింది. ఈ సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ... డీఎస్సీపై 150 కేసులు వేయించినా, విజయవంతంగా పూర్తిచేసి టీచర్ ఉద్యోగాలు భర్తీచేశాం. అదీ మా చిత్తశుద్ధి. మీరు గతంలో నిర్వహించిన గ్రూప్ -1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై యాక్షన్ తీసుకోవాలని కోర్టు చెప్పింది. ఈ సంవత్సరమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డిఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు. గొడ్డలిపార్టీ అధ్యక్షుడు జగన్ కు నిజం చెబితే తల వెయ్యి ముక్కలు అవుతుందని శాపం ఉంది. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా జాతికి అంకితం చేశారు. ఆర్ అండ్ ప్యాకేజీ ఇచ్చి, పనులన్నీ పూర్తిచేస్తే క్రెడిట్ చోరీ అంటున్నారు. ఏనాడైనా ఆయన నిజం చెప్పారా? అన్నగారి నుంచి చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కెసిఆర్ పరిపాలన చూశా. జగన్ లాంటి చేతగాని నాయకుడ్ని నేను ఇంతవరకు చూడలేదు.

**స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయండి**

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికలకంటే మరో 2శాతం మెజారిటీ ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు మా చుట్టూ కాకుండా ప్రజల చుట్టూ తిరగండి, పదవులు ఇచ్చే బాధ్యత నాది. అభివృద్ధి కార్యక్రమాలపై ఫీడ్ బ్యాక్ ఇవ్వండి. 4లక్షల మంది నాయకులను మై టిడిపి యాప్ ద్వారా మానిటర్ చేస్తున్నాం. పార్టీ ఇచ్చే కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోండి. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్ లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటా. అవి చేశాక ప్రాధాన్యత క్రమంలో మిగిలినవి పనులు పూర్తి చేస్తాను. అభివృద్ధి, సంక్షేమం మన బాధ్యత. అయితే అది కేవలం పాస్ పోర్టు లాంటిది మాత్రమే. కార్యకర్తలంతా ప్రజలవద్దకు వెళ్లి వారితో మమేకమవ్వండి. అదే మనకు శ్రీరామరక్ష. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతారు.

**రాష్ట్రం గాడిన పడాలంటే మరో 3సార్లు గెలవాలి**

తెలుగుదేశం పార్టీది పెద్ద కుటుంబం, గత ఎన్నికల్లో జనసేన, బిజెపిలతో కలసి ప్రజల వద్దకు వెళ్లాం, 94శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత కొనసాగాలి. సిఎం, డిప్యూటీ సిఎం లకు క్లారిటీ ఉంది. కనీసం మరో మూడుసార్లు వరుసగా గెలిస్తేనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలం. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రం నష్టపోతుంది. ఐదేళ్లు ఎన్నో ఇబ్బందులు పడ్డాం, దొంగకేసులు పెట్టారు. నాపై 23కేసులు ఉన్నాయి. అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు, ట్రాక్టర్ ర్యాష్ డ్రైవింగ్ పెట్టారు. జగన్మోహన్ రెడ్డి మాదిరి నేను కంచుకోటలో పోటీచేయలేదు. 40ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91వేల మెజారిటీతో గెలిచా, అది నా సత్తా.

**జగన్ చేసిన తప్పులకు వైసిపి నేతల బలి**

జగన్ చేసిన తప్పుడు పనులకు కొందరు వైసిపి నాయకులు ఈరోజు జైలుకు వెళ్తున్నారు, ఇప్పుడు కులం కార్డు తీస్తున్నారు. జగన్ సిఎం అయ్యాక బిసి సోదరులకు 10శాతం రిజర్వేషన్ తగ్గించి, 17వేలమంది బిసిలకు పదవులు రాకుండా అడ్డుకున్నారు. తమ అక్కను వేధిస్తున్నారని ప్రశ్నించిన అమర్నాథ్ గౌడ్ ను దారుణంగా చంపేశారు. నందం సుబ్బయ్య, తోట చంద్రయ్యను కిరాతంగా హత్య చేశారు. మాజీమంత్రి సీదిరి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేసి, పరారయ్యాడు. తండ్రి కొడుకు బదులు మరొకరిని ప్రవేశపెట్టారు. చనిపోయిన నిరుపేద కుటుంబాన్ని కనీసం ఆదుకోలేదు. కారుమూరి నాగేశ్వరరావు లిక్కర్ కేసులో అడ్డంగా బుక్కయ్యారు. లిక్కర్ రవాణాలో డబ్బులు కొట్టేశారు. అవినీతి సొమ్మును కోడలు ఎకౌంట్ లో డిపాజిట్ చేశారు. ఈడి గుర్తించింది. మధ్యలో పారిపోయారు. తప్పు చేయకపోతే ఎందుకు పారిపోయారు. ఐబి, సిబిఐ పట్టుకొచ్చారు. దీనికి ప్రభుత్వానికి ఏం సంబంధం, మీరు చేసిన తప్పుల వల్లే జైలుకు వెళుతున్నారు. అధికారంలో ఉన్నపుడు కొల్లు, అచ్చెన్న, అయ్యన్నలపై తప్పుడు కేసులు బనాయించారు. ప్రస్తుత ఎంపి విజయ్ పై తప్పుడు కేసులు పెట్టి అరెస్టుకు ప్రయత్నించారు. వైసిపి పాలనలో అరాచకాలను ప్రజలందరికీ చెప్పాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉంది.

**అహంకారం వద్దు...కలిసి పనిచేయండి..**

పార్టీ నాయకులు, కార్యకర్తలకు అహంకారం వద్దు, కలసికట్టుగా పనిచేద్దాం. ఒంగోలులో అద్భుతమైన ఎమ్మెల్యే, ఎంపి ఉన్నారు. సమస్యలు ఉంటే పరిష్కరించుకుందాం. రాష్ట్ర భవిష్యత్తు కోసం మళ్లీమళ్లీ చంద్రబాబును సిఎంగా చేయాలి. చాలా కఠినమైన పరిస్థితుల్లో రాష్ట్రం ఉంది. రూపాయికి 94పైసలు జీతాలకు సరిపోతోంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఏపీ నెంబర్ వన్‌గా ఉండాలని చంద్రబాబు అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్నారు అని మంత్రి లోకేష్ తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ... ఒంగోలు నగర ప్రజల తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి అమృత్ 2.0 పథకాన్ని చేపట్టాం. కార్పొరేషన్ కు తాజాగా రూ.78 కోట్లు మంజూరైంది, డ్రైన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతాం. డిజెఆర్ ట్రస్ట్ ద్వారా 6నుంచి 10వరకు 500మంది పేదపిల్లలను చదివిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఒంగోలు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకట్రాజు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జడ్ శివప్రసాద్, ఉత్తరాంధ్ర పార్టీ కోఆర్డినేటర్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# రాడిసన్ 5 స్టార్ హోటల్‌కు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 28**

నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో రాడిసన్ హోటల్ నిర్మాణంతో అంతర్జాతీయ స్థాయి ప్రాచుర్యాన్ని పొందనుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. నాగులుప్పలపాడు మండలం చదలవాడ గ్రామంలో రూ.100 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న రాడిసన్ హోటల్ కు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, శాఖల మంత్రి నారా లోకేష్ భూమిపూజ, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక రంగాల అభివృద్ధిలో మరో కీలక ముందడుగు పడిందని అన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం రవిశంకర్ గ్రూప్, రవిప్రియ హాస్పిటాలిటీస్ ఎల్‌ఎల్‌పీ సంయుక్త భాగస్వామ్యంతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ హోటల్ ను నిర్మించనున్నారని, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు కానున్న తొలి 5-స్టార్ హోటల్‌గా ఇది నిలవనుందని తెలిపారు. ఒంగోలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఈ ప్రాజెక్టు స్థానిక ఆర్థిక వ్యవస్థకు మరింత వేగాన్ని అందించనుందని తెలిపారు. రాడిసన్ హోటల్ ఏర్పాటుతో నిర్మాణ దశతో పాటు హోటల్ కార్యకలాపాలు ప్రారంభమైన తర్వాత స్థానిక యువతకు ప్రత్యక్ష, పరోక్షంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. హాస్పిటాలిటీ, టూరిజం, రవాణా, సేవా రంగాల్లో ఉద్యోగ,



ఉపాధి అవకాశాలు పెరగ నున్నాయని. వీటితో పాటు సమీప ప్రాంతాల్లో భవిష్యత్‌లో హోటల్ మేనేజ్ మెంట్ సంస్థలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమం అనంతరం తనని చూసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరితో ఫోటో దిగి ఆత్మీయంగా మంత్రి నారా లోకేష్ పలకరించారు. కార్యకర్తల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి బాల శ్రీ వీరాంజనేయ స్వామి, రవిశంకర్ గ్రూప్ చైర్మన్ రవి శంకర్, ఎమ్మెల్యేలు విజయ్ కుమార్, ఏలూరి సాంబశివరావు, ఎంపీ



మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ శ్రీకాంత్, కలెక్టర్ రాజాబాబు, టూరిజం ఏపీ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ యాదవ్, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్, ఏపీ కల్చరల్ కమిషన్ చైర్మన్ పొడపాటి తేజస్వి, ఏపీ మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్యం, మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ, రవిశంకర్ గ్రూప్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ ఆక్స్ ఫర్డ్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 28**

పట్టణంలోని స్థానిక పామూరు రోడ్డు నందు గల బి.ఆర్ ఆక్స్ఫర్డ్ ఒలంపియాడ్ పాఠశాలలో శుక్రవారం రక్షాబంధన్ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా సమాజంలో సోదర భావాన్ని, ఐక్యతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ వేడుకల్లో పాఠశాల బాల,బాలికలందరూ ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు.ఈ సందర్భంగా బి.ఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కర రావు మాట్లాడుతూ రాఖీ అనేది కేవలం ఒక దారం పోగు కాదని, అది సమాజంలో మహిళల రక్షణకు, వారికి ఇచ్చే గౌరవానికి పురుషులు ఇచ్చే పవిత్రమైన భరోసా అని పేర్కొన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులలో ఇలాంటి సాంస్కృతిక విలువలను పెంపొందించడం అభినందనీయమన్నారు.అనంతరం విద్యాసంస్థల డైరెక్టర్ జి.బాల భాస్కరరావు మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి, అక్కాతమ్ముళ్ల అనురాగానికి ప్రతీక అయిన ఈ రక్షాబంధన్ పండుగ అందరి జీవితాలలో ఆనందాలు, ఆరోగ్యం, సిరిసంపదలను నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ బి.నరేంద్రబాబు, పాఠశాల డీన్, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# బుర్రాకు రాఖీ కట్టిన మహిళా నేతలు





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 28**

రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ శాసనసభ్యులు, ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ను కలిసి స్థానిక వైసీపీ కార్యాలయంలో సాంప్రదాయబద్ధంగా రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ సందర్భంగా ఆత్మీయతకు ప్రతీకగా రాఖీ కట్టి, అన్నాచెల్లెళ్ల అనుబంధం, ఆప్యాయతలను చాటుకున్నారు.పార్టీ కార్యక్రమాల్లో,ప్రజా సమస్యల పరిష్కారంలో తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు కొత్తగొర్ల వసంత, కందుకూరు నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు తుల్లూరి ఆదిలక్ష్మి, కందుకూరు నియోజకవర్గం అంగన్వాడీ అధ్యక్షురాలు దేవరకొండ ఆదిలక్ష్మి, పట్టణ మహిళ ఉపాధ్యక్షురాలు తన్నీరు ధరణి,గుడ్లూరు మండలం మహిళా ఉపాధ్యక్షురాలు నాగిశెట్టి మల్లిక, ఉలవపాడు మండలం మహిళ ఉపాధ్యక్షురాలు జంపని అనురాధ, మహిళానేతలు తాటిపర్తి సుధారాణి, బొల్లా. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు హారతి పట్టి బుర్రా.మధుసూదన్ యాదవ్ కు శుభాకాంక్షలు తెలిపారు అనంతరం బుర్రా మహిళా నేతలను ఆశీర్వదించి అన్నాచెల్లెల అనుబంధానికి ఆప్యాయతకు ప్రతికైన రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఓగూరులో చర్చి నిర్మాణాన్ని నిలిపివేయాలి

## -శ్రీ వరదరాజస్వామి ఆలయానికి సమీపంలో నిర్మాణంపై బీజేపీ నేతల అభ్యంతరం

## -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు వినతి పత్రం



**కందుకూరు పెన్ పవర్ ఆగస్టు 28**

కందుకూరు నియోజకవర్గ పరిధిలోని ఓగూరు గ్రామంలో శ్రీ వరదరాజస్వామి దేవాలయానికి సమీపంలో చేపడుతున్న చర్చి నిర్మాణాన్ని నిలిపివేసి, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కందుకూరు నియోజకవర్గ సమన్వయకర్త ఘట్టమనేని హరిబాబు పేర్కొన్న వివరాల ప్రకారం.. ఓగూరు గ్రామంలోని శ్రీ వరదరాజస్వామి దేవాలయానికి సుమారు 100 అడుగుల దూరంలో చర్చి నిర్మాణం చేపడుతున్నారని తెలిపారు. ఈ నిర్మాణానికి సంబంధించి గ్రామస్థుల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని, సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. గ్రామస్తుల వినతులు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. గ్రామంలో మత సామరస్యానికి విఘాతం కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్మాణానికి సంబంధించిన భూమి, అనుమతులు, పత్రాలను పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు జోక్యం చేసుకుని సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**బీజేపీ నాయకుల డిమాండ్....:** ఆలయానికి సమీపంలో జరుగుతున్న నిర్మాణంపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అనుమతులు స్థల హక్కులను పరిశీలించిన అనంతరం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఓటు వేయని యువతకు భవిష్యత్తుపై ప్రశ్నించే హక్కు ఉందా?

## - ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల స్వీప్ కార్యక్రమంలో కమిషనర్ కె. అనూష

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 28**

ఓటు వేయకుండా దేశ భవిష్యత్తుపై ప్రశ్నించడం కంటే, ముందుగా ఎన్నికల్లో పాల్గొని బాధ్యతగల పౌరులుగా నిలవాలని కందుకూరు మున్సిపల్ కమిషనర్ కె. అనూష పిలుపునిచ్చారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం సమన్వయంతో నిర్వహించిన స్వీప్ (ఓటరు అవగాహన) కార్యక్రమంలో ఆమె విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. యువత ఉద్యోగాలు, విదేశీ అవకాశాలు, జీవితంలో స్థిరపడడం గురించి ఎంతగా ఆలోచిస్తారో, అంతే బాధ్యతతో దేశానికి మంచి ప్రభుత్వం రావడానికి ఎన్నికల్లో కూడా పాల్గొనాలని అన్నారు. ప్రతి ఓటు దేశ దిశను మార్చే శక్తి అని, డబ్బు లేదా ప్రలోభాలకు ఓటును అమ్ముకోవడం ప్రజాస్వామ్యానికి నష్టం అని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటరు జాబితా సవరణ) కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు, పెద్దలు, అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించడం కూడా యువత సామాజిక బాధ్యత అని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ డా. కె. విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఓటు విలువ, ఎన్నికలపై చైతన్యం కల్పించిన




కమిషనర్ కె. అనూషకు కృతజ్ఞతలు తెలిపారు. దేశ అభివృద్ధికి యువత ప్రతి రంగంలో ముందుండాలని, ముఖ్యంగా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే ఎన్నికల్లో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. రవికుమార్ మాట్లాడుతూ, "బాధ్యతగల విద్యార్థి రేపటి బాధ్యతగల ఓటరు" అని అన్నారు. ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తమ ఓటు హక్కును వినియోగించడమే కాకుండా, సమాజంలో ఓటరు చైతన్యాన్ని పెంచే వారిగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు మున్సిపాలిటీ సిబ్బంది, వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు, డా. ఆశా మాధవి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పి. ఏడుకొండలు, కిషోర్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కందుకూరులో హెవీ వాహనాలపై ఆంక్షలు

## -నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు -సీఐ షేక్ అన్వర్ బాషా

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 28**

కందుకూరు పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యను దృష్టిలో ఉంచుకుని హెవీ వాహనాల రాకపోకలపై అమలు చేస్తున్న ఆంక్షలను పోలీసులు మరోసారి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిఐ షేక్ అన్వర్ బాషా మాట్లాడుతూ వ్యాపారుల విజ్ఞప్తి మేరకు మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు వ్యాపార అవసరాలకు సంబంధించిన లారీలను మాత్రమే పట్టణంలోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు.



ఇప్పటికే అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హెవీ వాహనాలకు పట్టణంలోకి ప్రవేశం లేదు అని అన్నారు. అయితే వ్యాపారుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య రెండు గంటల పాటు వ్యాపారానికి సంబంధించిన లారీలకు ప్రత్యేకంగా అనుమతి కల్పించినట్లు సీఐ పేర్కొన్నారు.

**ఈ సమయాల్లో ప్రవేశం నిషేధం**

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు లారీలు, పొట్టు, కర్రలు తదితర లోడ్లతో వెళ్లే ట్రాక్టర్లు, ఇతర హెవీ వాహనాలను పట్టణంలోకి అనుమతించబోమని అన్వర్ బాషా స్పష్టం చేశారు.పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రజలకు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగేందుకు ఈ నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించి నిషేధిత సమయాల్లో హెవీ వాహనాలతో పట్టణంలోకి ప్రవేశించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్వర్ బాషా హెచ్చరించారు.పట్టణ ప్రజలు, వ్యాపారులు, వాహన యజమానులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నియంత్రణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి





**అర్ధవీడు, పెన్ పవర్, ఆగస్టు 28**

రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలనిమండల వ్యవసాయ అధికారి ఎస్ మనోహర్ అన్నారు. పెద్దకందుకూరు, వీరభద్రపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ మనోహర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల సరిపడినంత వర్షపాతం లేనందున చేయాల్సిన ప్రత్యామ్నాయ పంటల గురించి రైతులకు తెలపడం జరిగింది. అలాగే సాంప్రదాయ పంటలైన వరి, మొక్కజొన్న, జొన్న , సజ్జలు మొదలైన పంటల కంటే ఉద్యానవ పంటలు మరింత లాభదాయకంగా ఉంటాయని తెలపడం జరిగింది. అలాగే పెద్ద కందుకూరు నందు వెలిగొండ సిరులు – అభివృద్ధికి రెక్కలు కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగింది. ఇందులో వెలుగొండ ప్రాజెక్టు యొక్క ప్రాముఖ్యతను గురించి రైతులతో మాట్లాడి , రైతులతో కలిసి పెద్దకందుకురు గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ రంగనాయకులు మరియు రైతులు పాల్గొన్నారు.

# చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

## -మూడు, నాలుగు రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని అనుమానం

## -కందుకూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు

**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 28**



కందుకూరు మండలం పలుకూరు గ్రామానికి పడమర వైపున ఉన్న పంట చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో చెరువులో మృతదేహం తేలుతూ ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు, 5.4 అడుగుల ఎత్తు కలిగి ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. మృతదేహం నీటిలో కొన్ని రోజులుగా ఉండటంతో శరీరం ఉబ్బిపోయి, చర్మం దెబ్బతిన్న స్థితిలో ఉన్నట్లు తెలిపారు. చెరువు గట్టుపై నీలం రంగు పూల డిజైన్ నిండు చేతుల చొక్కా, నీలం రంగు నైట్ ప్యాంటు లభ్యమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. మృతుడు మూడు, నాలుగు రోజుల క్రితం చెరువు పరిసర ప్రాంతానికి వచ్చిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి మృతి చెంది ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ, మరణానికి ఖచ్చితమైన కారణం దర్యాప్తు పూర్తయిన అనంతరం వెల్లడికానుంది. పలుకూరు గ్రామ వీఆర్వో శివశంకర్ ఇచ్చిన సమాచారంతో కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడి ఆచూకీ, గుర్తింపునకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మహనీయుల సేవలను భావి తరాలకు తెలియ చెప్పడమే లక్ష్యం

## ఒంగోలులో 20 మంది మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్







**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 28**

సమాజానికి విశిష్ట సేవలందించిన మహనీయుల సేవలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఒంగోలులోని కిమ్స్ హాస్పిటల్ ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన 20 మంది ప్రముఖుల విగ్రహాలను విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఒంగోలు నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచే ఒంగోలు గిత్త విగ్రహాన్ని కూడా మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. స్ఫూర్తిదాతల ఆలోచనలు నేటి యువతకు తెలియజేసేలా విగ్రహాల ఏర్పాటు కిమ్స్

హాస్పిటల్ జంక్షన్ వద్ద 20 మంది ప్రముఖుల విగ్రహాల ఏర్పాటు ఒంగోలు నగరానికి మరో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని నారా లోకేష్ పేర్కొన్నారు. వివిధ రంగాల్లో స్ఫూర్తిదాయక సేవలు అందించిన మహనీయులను స్మరించుకునే అవకాశం కల్పించడం ద్వారా వారి గొప్పతనాన్ని నేటి తరానికి పరిచయం చేసే లక్ష్యంతో విగ్రహాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వారి జీవితాలు, సేవలు, స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు నేటి యువతకు, భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని మంత్రి లోకేష్ అన్నారు. సామాజిక, సాంస్కృతిక, విద్యా, రాజకీయ, సాహిత్య తదితర రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖుల విగ్రహాలను ఒకేచోట ఏర్పాటు చేయడం స్ఫూర్తి దాయకం అని లోకేష్ అన్నారు. ప్రజలకు నిత్యం కనిపించే ప్రాంతంలో ఈ విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆయా మహనీయుల సేవలు, త్యాగాలు, వారి ఆశయాలు ప్రజలకు మరింత చేరువవుతాయని తెలిపారు.

**ఒంగోలుకు మరో ప్రత్యేక ఆకర్షణగా ఒంగోలు గిత్త విగ్రహం**

ఒంగోలు జాతి పశువులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక గుర్తింపును చాటిచెప్పేలా కిమ్స్ ఆసుపత్రి జంక్షన్ వద్ద ఒంగోలు గిత్త విగ్రహాన్ని మంత్రి లోకేష్ ఏర్పాటు చేశారు. ఒంగోలు గిత్త విశిష్టతను భావితరాలకు పరిచయం చేయడంతో పాటు, ప్రకాశం జిల్లా సంస్కృతి, పశుసంపదకు ఇది ప్రతీకగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఆనం రాంనారాయణ రెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, ఉగ్ర నరిసింహారెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించిన మహనీయుల విగ్రహాలు:**

రొండా నారపరెడ్డిలి -- మాజీ మంత్రి, మాజీ ఎంపీ, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. లిదర్శి చెంచయ్యలి -- స్వాతంత్ర్య సమరయోధుడు.

మాదాల నారాయణ స్వామి -- మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, భారత్-చైనా మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు.

నీలంరాజు వెంకట శేషయ్య -- తెలుగు సాహితీవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ పాత్రికేయులు. లికత్తి చంద్రయ్యలి -- ప్రకాశం జిల్లా మొట్టమొదటి కలెక్టర్.

వరదా శ్రీరాముల నాయుడు- ఒంగోలు తొలి పురపాలక సంఘ అధ్యక్షులు, నాలుగు సార్లు చైర్మన్‌గా సేవలు.

బివియల్ నారాయణ- 'పావలా డాక్టర్', పేదల డాక్టర్‌గా పేరుగాంచిన వైద్య శిఖామణి.

క్లా జాన్ ఎవరెట్‌లి - సామాజిక సేవకులు.

గోరంట్ల వెంకన్నలి - మహాదాత.

భద్రిరాజు కృష్ణమూర్తి -ఆధునిక ద్రావిడ భాషాశాస్త్ర పితామహుల్లో ఒకరు.

భానుమతి రామకృష్ణ -- ప్రముఖ నటి, నిర్మాత, దర్శకురాలు, స్టూడియో అధినేత్రి, రచయిత్రి, గాయని, సంగీత దర్శకురాలు.

గరికపాటి వరలక్ష్మి -- ప్రముఖ నటి, గాయని, నిర్మాత, దర్శకురాలు.

టి. కృష్ణ -- ప్రముఖ దర్శకులు, నిర్మాత, రచయిత.

పద్మశ్రీ షేక్ చినమౌలానా -- ప్రముఖ నాదస్వర విద్వాంసులు. ధారా రామనాథ శాస్త్రి -- నాట్యావధాని, ప్రముఖ సాహితీవేత్త.

నాగభైరవ కోటేశ్వరరావు -- ప్రముఖ కవి, సాహితీవేత్త, సినిమా మాటల రచయిత.

కలేకూరి ప్రసాద్ -- కవి, రచయిత, అనువాదకులు, దళిత విప్లవకర్త.


పైడి తెరేష్ బాబు -- ప్రముఖ హార్మోనిస్ట్, తబలా వాయిద్యకారులు, కవి, గాయకుడు, రచయిత, దళిత సాహితీవేత్త.

మల్లవరపు జాన్ -- రచయిత, కవి, సాహితీవేత్త.

బండారు రామారావు -- నాటక సమాజ నిర్వాహకులు, ఉపాధ్యాయులు.

# నోటరీ పబ్లిక్‌గా తిరుమల ప్రసాద్

**గిద్దలూరు పెన్ పవర్ ఆగస్టు 28**



గిద్దలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయ వాదిగా పనిచేస్తున్న ఏ. తిరుమల ప్రసాద్ ను ప్రభుత్వ నోటరీ గా నియమిస్తూ ఏపీ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల ప్రసాద్ గిద్దలూరు బార్ అసోసియేషన్ వైస్-ప్రెసిడెంట్ గా ఉంటూ న్యాయవాదిగా మంచి పేరు తెచ్చుకుంటూ ఇప్పుడు నోటరీగా నియమితులు కావడంతో పలువురు న్యాయవాదులు, మిత్రులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఎవరికైనా న్యాయ సహాయం కావాలన్నా, నోటరీ కి సంబంధించిన అఫిడవిట్లు కావాలన్నా గిద్దలూరు పట్టణం లోని వైఎస్సార్ సెంటర్ లో గల తన ఆఫీస్ లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉంటానని తెలిపారు.

# శ్రీ గాయత్రి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 28**

శ్రీ గాయత్రీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను గాయత్రీ భవన్--3, గాయత్రీ భవన్--5 పాఠశాల ప్రాంగణాల్లో నిర్వహించారు. విద్యార్థుల్లో సోదర--సోదరీమణుల అనుబంధం, ఆప్యాయత, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ సోదరులకు రాఖీలు కట్టి, సోదరభావాన్ని చాటుకున్నారు. విద్యార్థులకు రక్షాబంధన్ పండుగ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు వివరించారు. కుటుంబ బంధాలు, బాధ్యత, పరస్పర సహకారం వంటి మానవీయ విలువలను చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు విద్యార్థులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను విద్యార్థులకు పరిచయం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని శ్రీ గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ చింతలచెరువు రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్, యాజమాన్యం పేర్కొన్నారు.

# డిఐఈఓ గూడూరు రాజేంద్రబాబుకు బీటీఏ నాయకుల సన్మానం



**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 28**

జిల్లా డిఐఈఓ, జిల్లా విద్యాశాఖాధికారి గూడూరు రాజేంద్రబాబును సి. ఎస్. పురం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బీటీఏ జిల్లా అధ్యక్షులు లక్కీపోగు ఆంటోనీ ఆధ్వర్యంలో బిటిఏ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బిటిఏ నాయకులు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి కృషి చేస్తూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంతో పాటు పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా రంగానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. సన్మాన కార్యక్రమంలో బిటిఏ రాష్ట్ర నాయకులు దద్దాల శ్రీనివాసులు, మెడబలిమి ముసలయ్య, తాతపూడి ప్రతాప్, పాపబత్తిన నాగేశ్వరరావు, దేవూరి వెంకటేశ్వర్లు, సిల్వ కుమార్, రాజారావు, మణికుమార్, రామారావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బలరామ జయంతి మహోత్సవం

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 28**

స్థానిక జవహర్ నగర్ కాలనీలోని ఇస్కాన్ ప్రచార కేంద్రంలో బలరామ జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. హరే కృష్ణ ఉద్యమ వ్యవస్థాపకులు భక్తివేదాంత స్వామి ప్రభుపాదుల వారు భారతీయ సంస్కృతిని, భగవద్గీత తత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని, అందులో భాగంగా శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలలో తొలి పండుగ అయిన బలరామ జయంతిని ఇస్కాన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఘనంగా జరుపుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ శ్రీ కృష్ణ బలరాములకు ఫలరసాలు, కొబ్బరికాయలతో వైభవంగా మహా సంకల్ప అభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారికి మహా పుష్పయాగం, బలరామ పౌర్ణమి సందర్భంగా శ్రీ శ్రీ రాధా గోవిందులకు ఉయ్యాల సేవ మహోత్సవం నిర్వహించారుఈ కార్యక్రమంలో తిరుపతి ఇస్కాన్ నుండి వచ్చిన నిత్యముక్త దాస్ బలరామ జయంతి ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రవచనం చేయనున్నారు. అనంతరం భక్తులందరికీ ప్రసాద వితరణ ఉంటుంది. ఈ వేడుకలకు భక్తులందరూ విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఇస్కాన్ భక్త బృందం కోరారు.



# 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలి

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఆగష్టు 28**



వివిధ కారణాలవల్ల వికలాంగులుగా మారిన వారిపట్ల ప్రభుత్వం సానుభూతిగా స్పందించాలని, 2016 వికలాంగుల హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య అన్నారు. శుక్రవారం నాడు స్థానిక పట్టణంలోని సన్ జో సేవాలాయ మానసిక వికలాంగుల అనాధ ఆశ్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి 20 వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి విహెచ్ పి యస్ యర్రగొండపాలెం నియోజకవర్గ అధ్యక్షులు పోలేపల్లి. పెద్ద పాలంకయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పద్మ శ్రీ కృష్ణ మాదిగ న్యాయకత్వంలో తాము చేసిన పోరాటాల ఫహిలితంగా ఆరు వేల పెన్షన్ ను కూటమి ప్రభుత్వం ద్వారా సాధించుకున్నామని, పోరాటాల ద్వారా నే హక్కులు సాదించుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి దివ్యాంగుల సమస్యల పై ప్రత్యేక శ్రద్ధ వహించి వికలాంగులకు 10 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని, అన్నీ శాఖలలో ఖాళీగా వున్న బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని,శారీరక వికలాంగుల రోస్టర్ ను 10 లోపు సవరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వికలాంగుల హక్కుల పోరాట సమితి 20 వ ఆవిర్భావ దినోత్సవ కేక్ ను కట్ చేసి మానసిక వికలాంగులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో విహెచ్ పి యస్ సీనియర్ నాయకులు కనమాల కోటేశ్వరరావు, తెల్లమేకల. నారాయణ రాజు యాదవ్,తెప్పల వెంకటేశ్వర్లు, అల్లూరి. శివనారాయణ,సందిరెడ్డి వెంకటరెడ్డి, ఆవుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# శింగరకొండలో సోలార్ ప్లాంట్ ప్రారంభం

## స్వామివారిని దర్శించుకున్న మంత్రులు గొట్టిపాటి రవికుమార్, టీజీ భరత్.

## రూ.12 లక్షలతో 37 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు.





**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) ఆగస్టు 28:**

అద్దంకి పర్యటనలో భాగంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ శుక్రవారం శింగరకొండలో పర్యటించారు. ముందుగా స్థానిక శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రులకు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

**సోలార్ ప్లాంట్‌తో తగ్గనున్న విద్యుత్ వ్యయం..**

శింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో రూ.12 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 37 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌ను మంత్రులు గొట్టిపాటి. రవికుమార్, టీజీ భరత్ లాంఛనంగా ప్రారంభించారు. వ్రిద్ధి ఇన్ఫ్రాటెక్ సంస్థ ఆర్థిక సహకారంతో దేవస్థానానికి ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సౌర విద్యుత్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌తో ఆలయ అవసరాల్లో కొంత భాగాన్ని సొంతంగా సమకూర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. ఫలితంగా దేవస్థానంపై విద్యుత్ వ్యయం భారం తగ్గడంతో పాటు, పునరుత్పాదక ఇంధన వినియోగం పెరుగుతుందని మంత్రులు వివరించారు.

**అన్నదాన సత్రానికి శంకుస్థాపన..**

స్వామివారి దర్శనం, సోలార్ ప్లాంట్ ప్రారంభోత్సవం అనంతరం మంత్రులు వాసవీ ఆర్యవైశ్య అన్నదాన సత్రం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శింగరకొండకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. దేవస్థాన అభివృద్ధితో పాటు భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆలయ పరిసరాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఘనంగా వెంకటేశ్వర స్వామి నామాల ప్రతిష్ట



**సంతమాగులూరు,(బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 28**

'ఓం నమో వెంకటేశాయ' అష్టాక్షరి మంత్రం మారుమోగుతుండగా కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి నామాల ప్రతిష్టాపన కార్యక్రమం శుక్రవారం, కొత్తపాలెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గుంటుపల్లి పవన్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో కోటప్పకొండ క్షేత్రానికి చెందిన వేద పండితులు ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. జలాభిషేకం, చందనాభిషేకం, ధాన్య అభిషేకం అనంతరం నామాల ప్రతిష్ట పూర్తి చేశారు. గ్రామంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరికీ ఆయురారోగ్య, ఐశ్వర్యాలు సమకూరాలని స్వామి వారిని కోరుకుంటూ ప్రత్యేక అభిషేకాలు నిర్వహించినట్లు పవన్ కుమార్ శర్మ తెలిపారు, శ్రీ చూర్ణం, పచ్చ కర్పూరంతో నామాన్ని దిద్దుతూ భక్తులు పులకించిపోతున్నారు. ఈ సందర్భంగా అన్నసంతర్పణ కొనసాగనుంది. సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది.

# దశాబ్దాల నాటి సమస్యకు 20 రోజుల్లో తెర

## పాత మాగులూరులో పూర్తయిన నూతన వంతెన నిర్మాణం

**సంతమాగులూరు, ఆగస్టు 28**

పాత మాగులూరు గ్రామంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న స్మశాన వాటిక రహదారి సమస్యకు కేవలం 20 రోజుల్లోనే తెరపడింది. గ్రామస్తుల ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో రూ.20 లక్షల నిధులతో చేపట్టిన నూతన వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి.

ప్రజా రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా 17.5 మీటర్ల పొడవు, 22 అడుగుల వెడల్పుతో, మీటర్ వ్యాసం కలిగిన ఐదు వరుసల గోనెలతో వంతెన నిర్మాణాన్ని పూర్తి చేశారు. వర్షాకాలంలో స్మశాన వాటికకు వెళ్లేందుకు గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఈ వంతెన నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభించింది.

**నాయకుల చొరవతో పనులు వేగవంతం**

గ్రామస్తుల అవసరాన్ని గుర్తించిన మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చేవూరి వాసిరెడ్డి, గడ్డం నాగిరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్ తదితరులు సమస్యను మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వెంటనే స్పందించి నిధులు మంజూరు చేయించడంతో పాటు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా సహకరించారు.గ్రామ నాయకులు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు చల్లా కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, నాగాంజనేయులు ఆధ్వర్యంలో నిర్మాణ



పనులు వేగవంతంగా సాగాయి. పంచాయతీరాజ్ శాఖ ఏఈ వెంకట్, డీఈ నాగేశ్వరరావు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులు నాణ్యతా ప్రమాణాలతో పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కేవలం 20 రోజుల్లోనే వంతెన నిర్మాణం పూర్తయింది.

**మంత్రి, నాయకులకు గ్రామస్తుల కృతజ్ఞతలు**

దశాబ్దాల నాటి సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు, సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లిన మండల,



గ్రామ నాయకులకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిన పంచాయతీరాజ్ అధికారులు ఏఈ వెంకట్, డీఈ నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.వంతెన నిర్మాణం పూర్తికావడంతో స్మశాన వాటికకు వెళ్లే మార్గం సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోయాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# మంత్రి లోకేష్‌కు శ్రీ హర్షిణి విద్యార్థుల ఘన స్వాగతం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 28**

ప్రకాశం జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు ఒంగోలులోని శ్రీ హర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి రాక సందర్భంగా కళాశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.శ్రీ హర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మంత్రి నారా లోకేష్ కు పూల బొకే అందజేసి సాదరంగా ఆహ్వానించారు. కళాశాల విద్యార్థినులు సైతం పూల బొకేలతో మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ ను ప్రత్యక్షంగా చూసిన విద్యార్థినులు ఆనందంతో కేరింతలు కొట్టడంతో కళాశాల ప్రాంగణం మారుమోగింది. ఐటీ కంపెనీలు తీసుకొచ్చి, ఉద్యోగాలు కల్పిస్తున్న మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు అంటూ విద్యార్థినులు ప్లకార్డులు ప్రదర్శించారు. విద్యార్థిని లతో మంత్రి నారా లోకేష్ ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో శ్రీ హర్షిణి విద్యా సంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, జిఎం శివరాం, డీన్ దాది ఆంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామయ్య, నారాయణ, రమేష్ బాబు, ఏడుకొండలు, నాగేంద్ర, ఏవోలు ప్రతాప్, గిరీష్, విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మీరే... నా అక్కలు, నా చెల్లెళ్లు

**- టీడీపీ మహిళా కార్యకర్తలతో నారా లోకేష్ భావోద్వేగం**

**- రాఖీలు కట్టి యువనేతకు రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపిన మహిళా కార్యకర్తలు**



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఆగస్టు 28**

టీడీపీ మహిళా కార్యకర్తల ఆప్యాయత, అండదండలు తనకు కొండంత బలమని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. ఒంగోలు పర్యటనలో భాగంగా టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశానికి హాజరైన మంత్రి నారా లోకేష్‌కు టీడీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు ఆత్మీయంగా రాఖీలు కట్టారు. రక్షాబంధన్ సందర్భంగా మహిళా కార్యకర్తలు తనకు రాఖీలు కట్టడంతో మంత్రి లోకేష్ భావోద్వేగానికి గురయ్యారు. రాఖీలు కట్టిన మహిళా కార్యకర్తలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారితో ఆత్మీయంగా మాట్లాడారు. "నాకు తోబుట్టువులు లేకపోయినా.. మీరు నన్ను సొంత అన్న, తమ్ముడిలా ఆదరిస్తున్నారు. మీరే నా అక్కలు, నా చెల్లెళ్లు. మీరు చూపిస్తున్న ఆప్యాయత, అందిస్తున్న అండదండలే నాకు కొండంత బలం" అని మంత్రి నారా లోకేష్ అన్నారు.

# గ్రామ సందర్శనలో భాగంగా విద్యార్థుల సమస్యలపై ఆరా - ఎస్సై నాగరాజు



**సంతమాగులూరు, (బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 27**

గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని గొర్రెపాడు, కుకట్లపల్లి, గ్రామాలలోని ఎస్సీ కాలనీ లలోనీ ప్రజలతో ఎస్సై నాగరాజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా పోలీసు సిబ్బంది ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటికి శాశ్వత పరిష్కార మార్గాలు చూపుతారు అన్నారు. అనంతరం స్థానిక పాఠశాలలను పరిశీలించారు. ఉపాధ్యాయుల తోను, విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో సమస్యలపై ఆరా తీశారు . గత ఎన్నికల సమయంలో పాఠశాలల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూతుల వివరాలు తెలుసుకున్నారు., మహిళలు, పిల్లల భద్రతపై, ప్రత్యేక సూచనలు చేశారు. గ్రామాలలో నూతన వ్యక్తుల కదలికలపై తక్షణ సమాచారం అందజేయాలన్నారు. ఆన్లైన్ బెట్టింగ్ యాప్లతో తమ కుటుంబంలోని చిన్నారులు అప్పుల ఊబిలో కూరుకుపోకుండా, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి అని అన్నారు.. పరస్పర గౌరవం, చట్టబద్ధత , ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి ఆయన ప్రజలకు వివరించారు.

# జగన్ జపం మాని... పాలనపై దృష్టి పెట్టండి

## చంద్రబాబుకు వైసీపీ నేత సయ్యద్ గౌస్ మోహిద్దీన్ సూచన

**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 28**





రాష్ట్రాన్ని పాలించడం చేతకాని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతి విషయంలోనూ వైఎస్ జగనన్మోహన్ రెడ్డి ని టార్గెట్ చేస్తూ పదేపదే ఆయన జపం చేస్తున్నారని వైసీపీ మైనార్టీ అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ విమర్శలు చేశారు. వైసిపి హయాంలో 90 శాతం పూర్తి చేసుకున్న వెలుగొండ ప్రాజెక్టును కూడా తానే పూర్తి చేసినట్లు చెప్పుకుంటున్న చంద్రబాబు వాస్తవానికి ఈ ప్రాజెక్టు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభమైందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రంలోని సమస్యలను పరిష్కరించకుండా ప్రతి విషయంలోనూ వైఎస్ జగన్ ను సాకుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు. పదేపదే వైయస్ జగన్ స్మరిస్తూ చంద్రబాబు ఆయన జపం చేస్తున్నారని పేర్కొన్నారు. వైయస్ జపం చేస్తే మంచిదేనని కాకపోతే జగన్ యొక్క మంచి పాలన అలవాట్లు అలవర్చుకుంటే బాగుంటుందని చంద్రబాబుకు సయ్యద్ గౌస్ మోహిద్దీన్ సూచించారు. రాష్ట్రంలో మరుమారు వైఎస్ జగన్ పాలన రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, ఈ నేపథ్యంలోనే చంద్రబాబు పదే పదే జగన్ జపం చేస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. పాలకుడు ఇలా ఉండాలి అన్న దానికి జగన్ గీటురాయిగా మారితే, పాలకుడు ఇలాంటి వాడు ఉండకూడదని దిక్సూచిగా చంద్రబాబు నిలిచారని ఆయన ఎదేవా చేశారు. ఇప్పటికైనా చంద్రబాబు ప్రతి విషయంలో జగన్ను టార్గెట్ చేయడం మానేసి పాలనపై దృష్టి సారించాలని సూచించారు. జగన్ ఏమిటో రాష్ట్ర ప్రజలకు తెలుసని, అందుకే ఆయన మరో మారు సీఎం కావాలని జనం కోరుకుంటున్నారని అయన వెల్లడించారు.

# ఒంగోలు నగర ప్రజల గొంతుల్లో ఇక 'అమృత' ధార

**- రంగరాయుడు చెరువులో అమృత్ 2.0 తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేష్**





**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 28**

ప్రకాశం జిల్లా ఒంగోలు నియోజక వర్గంలోని రంగరాయుడు చెరువులో అమృత్ 2.0 త్రాగునీటి ప్రాజెక్టుకు విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఒంగోలు నగర ప్రజలకు 24ఇ7 తాగునీటి సరఫరా అందించే దిశగా రూ.424. 42 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టిందని అన్నారు. మేఘా ఇంజనీరింగ్ సంస్థ రెండేళ్లలో ఈ పనులను పూర్తి చేయనున్నదని పేర్కొన్నారు. ప్రాజెక్టులో భాగంగా ఒంగోలు నగరంలోని మొత్తం 35 డిస్ట్రిబ్యూషన్ జోన్లను రీ-జోనింగ్ చేసి, 605.30 కిలోమీటర్ల పొడవున తాగునీటి పంపిణీ నెట్‌వర్క్ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు పోతున్నట్లు చెప్పారు. దీనిద్వారా 51,340 హౌస్ సర్వీస్ కనెక్షన్లు ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఇంటికీ మెరుగైన తాగునీటి సరఫరా అందుతుందని తెలిపారు. నగరంలో నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరించి, ప్రజలకు నిర్ణీత సమయాల్లో మాత్రమే కాకుండా 24 గంటలూ తాగునీరు అందుబాటులో ఉండేలా చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం గా చెప్పారు. రోజుకు 85 మిలియన్ల లీటర్ల నీటిని సరఫరా చేస్తారని, పెరుగుతున్న ఒంగోలు నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన, స్థిరమైన నీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్ రావు, విజయ్ కుమార్ , స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరులకు నివాళి

**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 28**



ఒంగోలులోని సుందరయ్య భవనంలో విద్యుత్ అమరవీరులకు సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు వై సిద్దయ్య నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెంచిన విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా 2000 ఆగష్ట్ 28 నాడు హైదరాబాద్ బషీర్ బాగ్ లో ఉద్యమిస్తున్న వారిపై చంద్రబాబు ప్రభుత్వం కాల్పులు జరిపిందన్నారు. ఈ పోరాటంలోరామకృష్ణ, విష్ణువర్ధన్, బాలాస్వామి అనే ముగ్గురు యువకిశోరాల ప్రాణాలు తీసిందన్నారు. ఈ ఉద్యమ ఫలితంతోనే ఆంధ్రప్రదేశ్ లో 10ఏళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచడానికి ప్రభుత్వాలు భయపడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అధికారానికి కూడా దూరమయ్యారని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు మాట్లాడుతూ అమరవీరుల స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు నిర్మించేందుకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటంలో ప్రజలందరూ ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు సకల సౌకర్యాలు కలుగజేస్తాం.. డిపో మేనేజర్ మెహబూబీ



**సంతమాగులూరు,(బల్లికురవ) పెన్ పవర్, ఆగస్టు 28**

నూతనంగా అభివృద్ధి పరిచిన బల్లికురవ బస్ స్టేషన్ లో ప్రయాణికుల సౌకర్యార్థం సకల సౌకర్యాలు కలుగజేయున్నట్లు అద్దంకి డిపో మేనేజర్ మెహబూబీ తెలియజేశారు. శుక్రవారం సాయంత్రం బస్ స్టేషన్ను ఆమె తనిఖీ చేశారు. మహాకూటమి ప్రభుత్వం ప్రయాణికుల పట్ల చిత్తశుద్ధికి ,దాతల సహకారంతో శిథిలావస్థకు చేరిన అ స్టేషన్ భవనానికి ఆదనపు హంగులు సమకూరాయి అన్నారు.హిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్ సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలన్నారు.అద్దంకి, చిలకలూరిపేట బస్ డిపోలకు చెందిన అన్ని బస్సు సర్వీసులు బస్ స్టేషన్ ద్వారానే రాకపోకలు సాగిస్తున్నందున ప్రయాణికులంతా బస్ స్టేషన్ లోనే బస్సులు ఎక్కాలన్నారు. సమయానుకూలంగా బస్సుల వివరాలు తెలియజేసేందుకు ప్రత్యేక కేర్ టేకర్ ను కూడా ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికులకు ప్రత్యేక , బల్లలు ఏర్పాటు చేయడంతో పాటు, ఫ్యాన్లు, మంచినీటి సౌకర్యం కూడా కలుగ చేస్తామన్నారు. త్వరలో మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని, బస్ స్టేషన్ అభివృద్ధికి ప్రయాణికులు తమ వంతు తోడ్పాటు అంద చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఆమె వెంట సి ఆర్ సి కొండలు, సిబ్బంది ఉన్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు పై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు

## రాజుపాలెం లోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో నిర్వహించిన పోటీలు





**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 28.**

ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్ట్ ను ప్రారంభిస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని కొమరోలు మండలం రాజుపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్లో శుక్రవారం వెలుగొండ జలాలు- అభివృద్ధి సిరులు అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌరీ పెద్ది సౌమిత్రి అధ్యక్షత వహించగా, ఆ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యాసరచన పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పెయింటింగ్ పోటీలలోని విజేతలకు బహుమతులు అందించి అభినందించారు.ఆ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు,ఆ పాఠశాల ఉపాధ్యాయులు, సిఆర్పి రామాంజి, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# కొమరోలు ప్రభుత్వ హైస్కూల్ లో విద్యార్థులకు వ్యాసరచన,వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు

### వెలుగొండ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పోటీలు నిర్వహణ






**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 28.**

వరాల వెలుగొండ అనే అంశంపై శనివారం కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాసరచన వక్తృత్వ చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనాగేశ్వర అధ్యక్షత వహించగా,కొమరోలు ఎంఈఓ లు శ్రీనివాసులరెడ్డి, వెంకటేశ్వర్లుగా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈనెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు వెలుగొండ ప్రాజెక్టుపై అవగాహన కల్పించేందుకుఈ వరాల వెలుగొండ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ,చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు సి ఆర్ పి కే పుల్లయ్య, బోధ నేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సి ఎస్ పురం సర్పంచ్ రేసులో తోట కనకయ్య



**సి.ఎస్.పురం,పెన్ పవర్ ఆగస్టు 28**

మండల కేంద్రంలోని సి.ఎస్.పురం మేజర్ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తోట కనకయ్య పోటీలో ఉన్నట్లు తెలిపారు. 1983 నుంచి రాజకీయ రంగంలో కొనసాగుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆయనకు గ్రామంలో మంచి గుర్తింపు ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.ఈ నేపథ్యంలో సర్పంచ్ అభ్యర్థిత్వంపై తోట కనకయ్యను వివరణ కోరగా తాను సర్పంచ్ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. గ్రామంలో ఉంటూ ప్రజలతో మమేకమై వారి అవసరాలు తెలుసుకుంటూ సమస్యలను పరిష్కరించుటకు నా వంతు కృషి చేస్తున్నానని అన్నారు తాను ఇప్పటివరకు చేసిన సేవా కార్యక్రమాలను గుర్తించి గ్రామ ప్రజలు తనను ఆదరిస్తారనే నమ్మకం ఉందని కనకయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్ గా అవకాశం లభిస్తే గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల సహకారంతో పంచాయతీని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

# విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై సర్వే

### -ప్రశాంతంగా ముగిసిన అభ్యసన సర్వే





**కందుకూరు పెన్ పవర్, ఆగస్టు 28:**

ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు ఎలా ఉన్నాయనే దానిపై విద్యాశాఖ శుక్రవారం సర్వే నిర్వహించింది. ఈ సర్వే మండలంలో ఎంపిక కాబడిన 6 పాఠశాలలోని 4, 6, 8 తరగతుల విద్యార్థులకు జరిగింది. మండలంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూల్స్ తో పాటుగా మహబూబ్ నగర్ (ఉర్దూ) హైస్కూల్, ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్, మాచవరం (హెచ్ పి), పలుకూరు (జనరల్) ఆదర్శ పాఠశాలల్లో ఈ అభ్యసన సర్వే జరిగింది. ఈ సర్వే పరీక్షా కేంద్రాలను స్థానిక ఎంఈఓ లు ఎం నాగ కుమార శర్మ, కె. సుబ్బారెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల వాస్తవ అభ్యసన స్థాయిలను అంచనా వేయడంతో పాటు అభ్యసన లోపాలను గుర్తించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈ సర్వేను విద్యాశాఖ నిర్వహిస్తుందన్నారు. పాఠశాల విద్య నాణ్యతను బలోపేతం చేసేందుకు ఈసర్వే ఎంతో కీలకమైందని వారు చెప్పారు. ఈ సర్వే ద్వారా లభించే ఖచ్చితమైన సమాచారం ఆధారంగా విద్యాప్రణాళికలు రూపొందించి విద్యార్థుల అభ్యసన ఫలితాలను మరింత మెరుగుపర్చువచ్చునని తెలిపారు. మండలంలో ఈ సర్వే ను ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు ఎం.వి రమణారెడ్డి, మహల్యారావు, సుబ్బారావు సంధాని భాష, ఏసుదాసు, మస్తాన్ వలి, సనావుల్లా, భారతి, రజిత, కిరణ్ వెంకటేశ్వర్లు తదితరులు నిర్వహించారు.





*కన్నా చూడు చూడు ! కనిపిస్తున్నాడే అతడే మన నారా లోకేష్. చైతన్య కెరటం. అభివృద్ధిలో దూసుకుపోయే చైతన్య యువతరంగం. రేపటి మన ఆశలకు మన ఉజ్వల భవిష్యత్తుకు అతడే నిజమైన భరోసా!!.*

# 30 న విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం

### విశ్వబ్రాహ్మణ ప్రముఖులకు ఆత్మీయ సత్కారం -వడ్లమాని నారాయణ చారి

**సి.ఎస్.పురం, పెన్ పవర్ ఆగస్టు 28**



విశ్వబ్రాహ్మణుల సేవలను గుర్తించి వారిని ప్రోత్సహించడంతో పాటు, సమాజ సమస్యలను చర్చించి పరిష్కార మార్గాలపై దృష్టి సారించేందుకు జిల్లా విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కంభం పట్టణంలో ఆదివారం విశ్వబ్రాహ్మణ ప్రముఖుల ఆత్మీయ సత్కార సభ నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ జిల్లా ఉపాధ్యక్షులు వడ్లమాని నారాయణచారి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సమాజానికి చెందిన పలువురు ప్రముఖులు తమ తమ రంగాల్లో విశేష సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. అటువంటి వారిని గుర్తించి ఆత్మీయంగా సత్కరించడం ద్వారా వారిలో మరింత సేవా స్ఫూర్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విశ్వబ్రాహ్మణ కుటుంబాల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు, సమాజంలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి సంఘం తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం భవిష్యత్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా ప్రముఖులు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. ఆత్మీయ సత్కార సభకు హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, ఆర్థిక నేరాల విభాగం క్రైమ్ బ్రాంచ్ అధికారి బ్రహ్మశ్రీ కమ్మరిపల్లి మల్లికార్జున కిరణ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు నారాయణచారి తెలిపారు. ఆయన సమక్షంలో విశ్వబ్రాహ్మణ ప్రముఖులను సత్కరించి సమాజానికి సంబంధించిన పలు అంశాలపై ఆత్మీయంగా చర్చించనున్నట్లు తెలిపారు మండలంలోని విశ్వబ్రాహ్మణులు ఈ కార్యక్రమానికి హాజరై తమ సమస్యలు సూచనలు అభిప్రాయాలను పంచుకుంటూ ఆత్మీయంగా పలకరించుకుంటూ కుటుంబ సమేతంగా విచ్చేసి ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# వెలుగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి

### కోవిలంపాడులో కరపత్రాలు పంపిణీ చేసిన టిడిపి నాయకులు



**సి ఎస్ పురం,పెన్ పవర్ ఆగస్టు 28**

కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి సూచనలతో కోవిలంపాడు గ్రామంలో శుక్రవారం టిడిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరిస్తూ బ్యానర్ ను ప్రదర్శించి కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రకాశం జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న వెలుగొండ ప్రాజెక్టు కల సాకారం కానుందని తెలిపారు. ఈ నెల 31న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించనున్నారని ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించి ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు ఈ కార్యక్రమానికి గ్రామంలోని రైతులు, ఎన్డిఏ కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు దొనపాటి మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎలికా వెంకటనారాయణ, చావా రామయ్య, చావా వెంకటసుబ్బయ్య, సందలూరి బాలకాశయ్య, నాయుడు వెంకటనారాయణ, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# దుర్గా మొబైల్ కేర్ షాపును ప్రారంభించిన ఎస్సై వెంకటేశ్వరరెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఆగస్టు 28**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం పట్టణంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు ఇండ్ల వెంకట సత్యం అన్న కుమారుడు దుర్గాప్రసాద్ నూతనంగా ఏర్పాటు చేసిన దుర్గ మొబైల్ కేర్ షాప్ ను శుక్రవారం ఎస్సై పి. వెంకటేశ్వరరెడ్డి, బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు కొండిశెట్టి వెంకట రమణయ్య, టిడిపి నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఒక్కరి జీవితంలో మొబైల్ ఫోన్ ఒక ముఖ్యమైన భాగంగా మారిందన్నారు. ప్రజలకు మొబైల్ ఫోన్లు, అవసరమైన ఉపకరణాలు, రిపేరింగ్ తదితర సేవలు అందుబాటులో ఉండేలా దుర్గ మొబైల్ కేర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల ప్రజలకు కూడా నాణ్యమైన సేవలు అందిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని పొంది వ్యాపార అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ప్రెసిడెంట్ పాములపాటి నరసయ్య, శ్రీను, ఎన్డీఏ కూటమి నాయకులు , స్థానిక వ్యాపారులు బంధుమిత్రులు స్నేహితులు పాల్గొన్నారు.



## అయ్యవారిపల్లె లో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించిన బోనేని వెంకటేశ్వర్లు యాదవ్.



**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 28**

కొమరోలు మండలం నల్లగుంట్ల పంచాయతీలోని అయ్యవారిపల్లి గ్రామంలో శుక్రవారం కొమరోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ ఇంటింటికి తెలుగుదేశం- ప్రజల ఇంటి ముంగిట కు సంక్షేమ పథకాలు అనే కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గత రెండేళ్లుగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలను వివరిస్తూ ముద్రించిన కరపత్రాలను వెంకటేశ్వర్లు యాదవ్ తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన రాష్ట్ర అభివృద్ధికి ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని, గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి చేస్తున్న కృషిని ప్రజలకు వివరించారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డు స్థాయి జిల్లా పరిషత్ స్థాయి వరకు అన్ని స్థానాలను తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ జనతా పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు ప్రజలు తమ వంతు సహకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం అందించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని వార్డు సర్పంచ్ పదవులు ఏకపక్షంగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేందుకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఆయన కోరారు. రాష్ట్రానికి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావటం, గిద్దలూరు నియోజకవర్గానికి ముత్తుముల అశోక్ రెడ్డి శాసనసభ్యులుగా ఎన్నిక కావడం ప్రజలు చేసుకున్న అదృష్టంగా ఆయన అభివర్ణించారు. ఆ కార్యక్రమంలో జ్యోతి ఇంద్రారెడ్డి, పాండురంగస్వామి, శివరాం, రాజకుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## వెలిగొండపై వైసీపీది కపట ప్రేమ: బీజేపీ నేత ఏలూరి




**మార్కాపురం పెన్ పవర్ ఆగస్టు 28**

వెలిగొండ నిర్వాసితులపై వైసీపీ కపట ప్రేమ చూపుతోందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి విమర్శించారు. నిర్వాసితులకు రూ.740 కోట్ల పరిహారం ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని అన్నారు. గత ప్రభుత్వం పరిహారం ఇవ్వకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేసిందని ఆరోపించారు. 2026 నాటికి 18 ఏళ్లు నిండిన నిర్వాసిత యువతకు రూ.2 లక్షలు ఇవ్వాలన్న సీఎం చంద్రబాబు నిర్ణయం హర్షణీయమన్నారు. మిగిలిన అర్హులకు కూడా న్యాయం చేస్తామని, వైసీపీ రాజకీయాలను ప్రజలు నమ్మవద్దని కోరారు.

## నేడు 15 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత.

**కొమరోలు పెన్ పవర్ ఆగస్టు 28**

కొమరోలు విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలోని 15 గ్రామాలకు ఈనెల 29వ తేదీ శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లుగా కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్ డి ఎస్ ఎస్ పథకం ద్వారా మండలంలో అమలు జరుగుతున్న కొత్త విద్యుత్తు లైన్ల ఏర్పట్లలో భాగంగా ఈనెల 29వ తేదీన మండలంలోని పలు గ్రామాలలో కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు చర్యలు తీసుకున్నామని ఆయన తెలిపారు. ఆ సందర్భంగా ఈనెల 29వ తేదీ శనివారం కొమరోలు, గోపానిపల్లి, పురుషోత్తమునిపల్లి, తాతిరెడ్డిపల్లి,, కే బొంతపల్లి, సర్వేరెడ్డిపల్లి, బావాపురం, సూరవారిపల్లి, బాదినేనిపల్లి, బొడ్డువానిపల్లి,, రామవారిపల్లి,బెడుసుపల్లి, మొట్టుపల్లి, గుంతపల్లి గ్రామాల పరిధిలో కొత్త లైన్లు ఏర్పాటు చేయుటకు ఏర్పాటు చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ఆ కారణంగా పైన పేర్కొన్న 15 గ్రామాలకు ఈనెల 29వ తేదీ శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లుగా ఆయన చెప్పారు కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



# డిజేఆర్ తో పెట్టుకుంటే దబిడి దిబిడే... మంత్రి నారా లోకేష్

- ఒంగోలు గడ్డకు తిరుగులేని జననేత.... లోకేష్ మెచ్చిన ధీశాలి.. ఒంగోలు రూలర్ ఒన్ అండ్ ఓన్లీ డిజేఆర్ అంటూ టిడిపి శ్రేణుల హర్షం

- నారా లోకేష్ ఒంగోలు పర్యటన గ్రాండ్ సక్సెస్


















**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 28**

మీ శాసనసభ్యుడు దామచర్ల జనార్ధన్ రావును చూస్తే ఎంతో సౌమ్యుడని అనుకుంటారు.. కానీ అతనితో పెట్టుకున్న వారికి తెలుసు దబిడి దిబిడే అని రాష్ట్ర విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. శుక్రవారం స్థానిక బాలాజీ తిరుపతి రావు ఫంక్షన్ హాల్ లో జరిగిన టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దామచర్ల జనార్ధన్ రావు టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎక్కడా అధైర్య పడకుండా ధైర్యంగా నిలబడి పార్టీని.. కార్యకర్తలను కాపాడుకుంటూ తెలుగుదేశం పార్టీకి ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాన్ని కంచుకోట గా తీర్చిదిద్దిన ఘనత దామచర్ల కే దక్కుతుందని అన్నారు. ఎప్పుడు కలిసిన ఒంగోలు నియోజకవర్గ అభివృద్ధి కోసం మాత్రమే మాట్లాడే దామచర్ల జనార్ధన్ రావు లాంటి గొప్ప నాయకుడు ఒంగోలు ప్రజలకు దక్కటం గొప్ప అదృష్టంగా లోకేష్ పేర్కొన్నారు.

**నారా లోకేష్ ఒంగోలు పర్యటన గ్రాండ్ సక్సెస్**

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. దామచర్ల కుటుంబం పార్టీ చెప్పిన ఆదేశాలను శిరసా వహిస్తూ అనుకున్న దానికన్నా కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ఎప్పుడు ముందు వరుసలోనే ఉంటుందని శుక్రవారం ఒంగోలులో నారా లోకేష్ పర్యటన గ్రాండ్ సక్సెస్ తో మరోమారు రుజువైంది. ఒంగోలు నగరంలోని త్రోవగుంట వద్ద నారా లోకేష్ ని ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు స్వాగతం పలుకుతూ ప్రారంభమైన ఒంగోలు పర్యటన ఆసాంతం ఎక్కడా ఎలాంటి చిన్న పొరపాటు కు తావివ్వకుండా అనుకున్నది అనుకున్నట్లుగా కార్యక్రమాలను దిగ్విజయంగా పూర్తి చేయడంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు సఫలీకృతులయ్యారు. ఎమ్మెల్యే దామచర్ల సూచనలతో తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆయన సూచనలు తూచా తప్పక పాటిస్తూ వేలాదిగా తరలివచ్చి అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడంలో తమ వంతు పాత్ర పోషించారు. చివరిగా జరిగిన కార్యకర్తల సమావేశంలో లోకేష్ మాట్లాడుతున్నప్పుడు వారి ఉత్సాహం అంబరాన్నంటాయి. పసుపు కండువాలను గిరగిరా తిప్పుతూ లోకేష్ జిందాబాద్ అంటూ.. డీజే జిందాబాద్ అంటూ.. జై తెలుగుదేశం అంటూ.. తెలుగుదేశం పార్టీ నాయకులు చేసిన నినాదాలు లోకేష్ లో మరింత ఉత్సాహాన్ని నింపింది. ఆ ఉత్సాహాన్ని కొనసాగిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపే లా.. లోకేష్ ప్రసంగం కొనసాగింది. ఒంగోలు అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూనే.. గొడ్డలి పార్టీ అంటూ జగన్ పై ఆయన విరుచుకుపడ్డారు. కార్యకర్తే అధినేత అంటూ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేస్తూనే.. అహాన్ని వీడితేనే భవిష్యత్తు ఉంటుందని సుతిమెత్తగా క్యాడర్ కు హితబోధ చేశారు. ఐకమత్యంతో నే రాబోయే ఎన్నికల్లో విజయం సాధ్యమవుతుందని అంతర్గత లోపాలుంటే సరి చేసుకోవాలంటూ సూచనప్రాయంగా నే స్పష్టం చేశారు.

# శ్రీవారికి పవిత్రాలు సమర్పణ





**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఆగస్టు 28**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా భక్తజన నయనానందకరంగా జరుగుతున్నాయి. పవిత్రోత్సవాల రెండవ రోజైన శుక్రవారం శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి శుక్రవార అభిషేకం ప్రత్యేకంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానంకు చెందిన ప్రముఖ వైఖానస ఆగమ వేద పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందం ఆధ్వర్యంలో శ్రీవారికి ఇతర దేవతామూర్తులకు పవిత్రాలను సమర్పించడం తో పాటు విశేష స్నపన తిరుమంజనం శోభాయమానంగా నిర్వహించారు. కుంభారాధన, నిత్య హోమం, సుదర్శనారాధన, పంచసూక్త హోమం, పారమాత్మిక హోమం, అష్టాశీతి హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం ఆలయ అర్చకులు శ్రీవారి ఏకాంత సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వర రావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ వారి ఉత్సవమూర్తులకు విశేష స్నపన తిరుమంజనం, సాయంత్రం పూర్ణాహుతి, రక్షాబంధన విసర్జన, ఆచార్య శేష వస్త్ర బహుమానం, బ్రహ్మ ఘోష కార్యక్రమాలు జరుగుతాయని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు తెలిపారు.

## ఏఆర్ టి సెంటర్ సందర్శన

**మునిసిపల్ కార్పొరేషన్ ఒంగోలు,పెన్ పవర్ ఆగస్టు 28**

స్థానిక రిమ్స్ హాస్పటల్ లోని ఏఆర్ టీ సెంటర్ ను ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంతల సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం మంజుల శుక్రవారం సందర్శించారు. ఎయిడ్స్ బాధితులకు అందుతున్న వైద్య సేవలు, ఐసిటిసి సెంటర్ ద్వారా బాధితులకు సేవలు గురించి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించడంలో, వారికి ఆత్మస్థైర్యం కలిగించడంలో సిబ్బంది మరింత కృషి చేయాలని పేర్కొన్నారు. హెల్ప్ స్వచ్ఛంద సంస్థ, బ్రో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నర్సింగ్ కాలేజీ, ఆదిత్య డిగ్రీ కాలేజీలో ఎంటెన్సీ ఫైడ్ ఐఇసి అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ, టిబి, ఎయిడ్స్ నియంత నా అధికారి డాక్టర్ బాలాజీ, డిఎన్ఎమ్ఓ డాక్టర్ భానుమతి, దిశా క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ అమీన్, సిఎస్ఓఎస్ సాయి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.వి.సాగర్, ఆదిత్య డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సంతోష్, లింక్ వర్కర్స్ స్కీం జిల్లా ప్రోగ్రాం మేనేజర్ స్వరూప్ కుమార్, గ్రో సీనాడ్ ప్రోగ్రాం మేనేజర్లు పీర్ భాష, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com